ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet
Edition

మంగళవారం, 23 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM



# తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

## సాయన్న, నందిత మృతికి సంతాప తీర్మానం.. రేపటికి వాయిదా

హైదరాబాద్, జూలై 23 (ప్రజాస్వరం) : తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. సమావేశాల మొదటి రోజు సంతాప తీర్మాణాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారు. అత్యంత సామాన్య కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదిగిన నేత సాయన్న అన్నారు. ప్రజలకు సేవలు చేస్తూనే ఆయన మరణించారని, ఆయన వారసురాలిగా అసెంబ్లీలో అడుగుపెట్టిన లాస్య నందిత ప్రమాదవశాత్తు మరణించడం బాధకారమన్నారు. సాయన్న మన మధ్యలేకపోయినా ఆయన కల నెరవేరిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో కలపాలని ఆయన కోరిక నెరవేరిందని తెలిపారు. ప్రస్తుతం ఆయన భౌతికంగా ఉంటే చాలా సంతోషించేవారని, కనీసం ఆయన వారసురాలిగా వచ్చిన లాస్య సందిత ఉన్నా ఆనందించేవారని అన్నారు. కీలకమైన ఈ సమయంలో వారిద్దరు మన మధ్యలేకపోవడం బాధాకరని సీఎం విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తూ తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### అండగా ఉంటాం: కేటీఆర్

ఏడాది వ్యవధిలోనే తండ్రీకుమార్తెలు మృతిచెందడం చాలా బాధాకరమని భారాస ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి సంతాపంగా శాసనసభలో ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంపై ఆయన మాట్లాడారు.

### స్పీకర్ చాంబర్‌లో బీఏసీ సమావేశం

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై అసెంబ్లీ ఆవరణంలోని స్పీకర్ చాంబర్ లో బీఏసీ సమావేశం ప్రారంభమైంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ లు, బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేలు హరీశ్ రావు, ప్రశాంత్ రెడ్డి,బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం తరపున బలాల హాజరయ్యారు. బడ్జెట్ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలి, ఏయే అంశాపై చర్చించాలనేదానిపై బీఏసీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. కాగా పది రోజుల పాటు సభను నిర్వహించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు సమాచారం. ఈ నెల 25వ తేదీన ప్రభుత్వం బడ్జెట్ ను సభలో ప్రవేశపెట్టనున్నది. అదే రోజు ఉదయం 9 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం అయి బడ్జెట్ కు ఆమోదం తెలుపనున్నారు.



# కేంద్రం పద్దు

## రూ.48.21 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్

## ఆదాయం రూ.32.07 లక్షల కోట్లుగా అంచనా

## అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లు

## ఆంధ్రప్రదేశ్‌కు రూ.15 వేల కోట్లు, బీహార్‌కు రూ. 20వేల కోట్లు

## తొమ్మిది ప్రాధాన్య అంశాల ఆధారంగా కేటాయింపులు

## వేతన జీవికి ఊరట.. రూ.3 లక్షల వరకు పన్ను లేదు

న్యూఢిల్లీ, జూలై 23 (ప్రజాస్వరం): పార్లమెంట్‌లో 'కేంద్ర బడ్జెట్'ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశ పెట్టారు. లోక్‌సభలో ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 8 నెలల కాలానికి వార్షిక బడ్జెట్ పరిమాణం రూ.48.21 లక్షల కోట్లు ఉండగా.. మొత్తం ఆదాయం రూ.32.07 లక్షల కోట్లుగా కేంద్రం వెల్లడించింది. ఇందులో పన్నుల ద్వారా ఆదాయం రూ.28.83 లక్షల కోట్లు సమకూరగా.. అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లుగా కేంద్రం అంచనా వేసింది. కాగా, ద్రవ్యలోటు 4.3 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. ప్రజల ఆంకాంక్షలకు అనుగుణంగా, వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్‌ను తయారు చేశామని నిర్మలాసీతారామన్ చెప్పారు. రానున్న ఐదేళ్లలో 4 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని నిర్మలా స్పష్టం చేశారు. విద్యా, నైపుణ్యాభివృద్ధికి రూ. లక్షా48 వేల కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, మహిళాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం పెద్ద పీట వేసింది. ఏపీ రాజధానికి రూ.15వేల కోట్లను కేంద్రం కేటాయించింది.

### తొమ్మిది ప్రాధాన్య అంశాలు

బడ్జెట్‌ను 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా ప్రవేశపెట్టారు. అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా అంశాలను ఎంపిక చేసుకుంది. 'వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన- నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన- ఆవిష్కరణలు, తయారీ- సేవలు, తర్వాతతరం సంస్కరణలు' ఈ తొమ్మిది అంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు ప్రకటించింది.

### 3 లక్షల వరకు పన్ను లేదు

కొత్తపన్ను విధానంలో పన్ను శ్లాబ్‌లకు స్వల్ప మార్పులు చేశారు. దీని ప్రకారం రూ.3 లక్షల వరకు ఎలాంటి పన్ను లేదు. రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు 5 శాతం, రూ.7 లక్షల నుంచి 10 లక్షల వరకు 10 శాతం, రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు 15 శాతం, రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు 20 శాతం, రూ.15 లక్షలకంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారికి 30 శాతం పన్ను వర్తిస్తుందని బడ్జెట్‌లో చెప్పారు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50వేల నుంచి రూ.75 వేలకు పెంచినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

### కేంద్ర బడ్జెట్‌లో కీలక ప్రకటనలివే..

స్టాండర్డ్ డిడక్షన్ రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంపు. కొత్త పన్ను విధానం శ్లాబుల్లో మార్పులు. సున్నా నుంచి రూ.3 లక్షల వరకు ఎలాంటి పన్ను లేదు.

-మొబైల్ ఫోన్లు, మొబైల్ పీసీడీఏ, మొబైల్ ఛార్జర్లపై విధించే బేసిక్ కస్టమ్స్ డ్యూటీ 15 శాతానికి తగ్గింపు. బంగారం, వెండిపై దిగుమతి సుంకం ఆరు శాతానికి తగ్గింపు. ప్లాటినమ్ పై 6.4శాతానికి కుదింపు.

-ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 3 కోట్ల అదనపు ఇళ్ల నిర్మాణం. అర్బన్ హౌసింగ్ కోసం ఐదేళ్లలో రూ.2.2 లక్షల కోట్లు.

-ముద్రా రుణాలు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంపు. బడ్జెట్ లో గ్రామీణ అభివృద్ధికి రూ.2.66 లక్షల కోట్లు కేటాయింపు.

-ప్రకృతి వ్యవసాయంలోకి దేశవ్యాప్తంగా కోటి మంది రైతులను తీసుకొచ్చే ప్రణాళిక. 5 రాష్ట్రాల్లో కిసాన్ క్రెడిట్ కార్డులు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి రూ.1.5 లక్షల కోట్లు.

-వచ్చే ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు నైపుణ్యాల శిక్షణ. 500 పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌లు.

-దేశీయ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు విద్యార్థులకు రూ.10 లక్షల వరకు విద్యా రుణాలు.

-మౌలిక సదుపాయాల కల్పనకు రూ.11.11 లక్షల కోట్ల కేటాయింపు.

-మహిళలు, బాలికల కోసం రూ.3 లక్షల కోట్లతో పథకాలు. విద్య, ఉపాధి, నైపుణ్యాలభివృద్ధికి రూ.1.48 లక్షల కోట్లు.

-రాష్ట్రాల మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రూ.1.5 లక్షల కోట్లతో దీర్ఘకాల వడ్డీ రహిత రుణాలు.

-నిరుద్యోగులకు మూడు ఉద్యోగ అనుసంధాన ప్రోత్సహకాలు. సంఘటిత రంగంలోకి ప్రవేశించిన తొలిసారి ఉద్యోగులకు ఒక నెల వేతనం మూడు వాయిదాల్లో గరిష్ఠంగా రూ.15 వేలు చెల్లింపు. నెలకు గరిష్ఠంగా రూ. లక్ష లోపు వేతనం ఉన్నవారు అర్హులు. దీనివల్ల 210 లక్షల మంది యువతకు లబ్ధి చేకూరుతుంది.

-పీఎం స్వనిధి కింద వంద నగరాల్లో ప్రత్యేక వారాంతపు సంతలు ఏర్పాటు. క్యాపిటల్ గెయిన్స్ విధానం సరళీకరణ. దీర్ఘకాల లాభాలపై 12.5శాతం పన్ను. స్టార్టప్ లకు ప్రోత్సాహకం.. ఏంజెల్ ట్యాక్స్ రద్దు.

## ఈసారి తెలుపు రంగులో..

న్యూఢిల్లీ, జూలై 23 (ప్రజాస్వరం): ఏటా బడ్జెట్ వేళ ఆర్థిక కేటాయింపుల పైనే కాదు.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ (Nirmala Sitharaman) ధరించే చీరల పైనా అందరి దృష్టి ఉంటుంది. దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా, హుందాతనాన్ని ద్విగుణీకృతం చేసేలా ఆమె ఎంచుకునే చీరలంటే (Sarees) ఎంతోమంది మహిళలకు ఆసక్తి. చేనేత చీరలంటే మక్కువ చూపించే నిర్మలమ్మ ఈసారి కూడా హ్యాండ్లూమ్ శారీనే ఎంచుకున్నారు. తెలుపు రంగు, బంగారు మోటిఫ్ లతో ఉన్న మెజెంటా బోర్డర్ కలగలిపిన సిల్క్ చీరలో ఆమె కన్పించారు.



## కేంద్ర బడ్జెట్‌లో కీలక రంగాలకు కేటాయింపులు ఇవే..!

న్యూఢిల్లీ, జూలై 23 (ప్రజాస్వరం): పార్లమెంట్ లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. వరుసగా ఏడోసారి కేంద్ర బడ్జెట్ ను నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ఫైనాన్స్ మినస్టర్ మాట్లాడుతూ.. ప్రజల మద్దతుతో మూడో సారి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అన్నదాతల కోసం ఇటీవలే మద్దతు ధరలు పెంచినట్లు గుర్తు చేశారు. మరో ఐదేళ్ల పాటు 80 కోట్ల ఉచిత రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

### శాఖలవారీగా కేటాయింపులు

- వ్యవసాయ, అనుసంధాన రంగాలు రూ. లక్షా 52 వేల కోట్లు
- విద్య, నైపుణ్యాభివృద్ధి - రూ.లక్షా 48 వేల కోట్లు
- ప్రధాన మంత్రి ఆవాస్ యోజన - రూ.2.2లక్షల కోట్లు
- గ్రామీణాభివృద్ధి - రూ.2.66 లక్షల కోట్లు
- మహిళాభివృద్ధి - రూ.3 లక్షల కోట్లు
- మౌలిక సదుపాయాలు - రూ. 11.11 లక్షల కోట్లు
- ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనులు రూ.15 కోట్లు
- బిహార్‌లో జాతీయ రహదారులకు రూ.20 వేల కోట్లు

## అమరావతికి రూ.15 వేల కోట్లు

రాష్ట్ర విభజన తర్వాత గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను గట్టెక్కించేలా బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుభవార్త చెప్పారు. కేంద్ర బడ్జెట్లో ఏపీకి ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు కేటాయిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం అందిస్తామని కేంద్రమంత్రి తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, రైతులకు జీవనాడి పోలవరం. భారత ఆహార భద్రతకు ఆ ప్రాజెక్టు ఎంతో కీలకమైనది. పోలవరం నిర్మాణం సత్వరం జరిగేలా చూస్తాం" అని నిర్మలమ్మ భరోసానిచ్చారు. ఏపీలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వనున్నట్లు నిర్మలమ్మ ప్రకటించారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేస్తామన్నారు. విభజన చట్టం



ప్రకారం పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తామని కేంద్రమంత్రి వెల్లడించారు. హైదరాబాద్ -బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందిస్తామన్నారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం చేస్తామన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్ , రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. విశాఖ - చెన్నై కారిడార్ లో కొప్పర్తికి, హైదరాబాద్ -బెంగళూరు కారిడార్ లో ఓర్వకల్లుకు నిధులు ఇస్తామని తెలిపారు.